పొగాకు రైతు కుదేలు!

- తగ్గిన దిగుబడి
- వేధిస్తున్న గిట్టుబాటు ధర
- క్వింటా రూ.8 వేలు పలకని ధర
- వైఎస్సార్‌సీపీ హయాంలో క్వింటా రూ.12 వేలు
- నాణ్యత పేరుతో బేళ్లను తిరస్కరిస్తున్న కంపెనీలు
- మగ్గుతున్న పొగాకు బేళ్లు
- జిల్లాలో 8,374 ఎకరాల్లో సాగు

కోవెలకుంట్ల: ఈ ఏడాది రైతులకు పొగాకు సాగు కలిసి రాలేదు. సాగుకు ముందు వర్షాభావం, పైరు వివిధ దశల్లో అధిక వర్షాలు,చీడపీడలు చుట్టు ముట్టి నష్టాల ఊబిలోకి నెట్టాయి. అరకొరగా దిగుబడు లు చేతికందినా సరైన ధర లభించకపోవడంతో రైతుల పరిస్థితి గందరగోళంగా మారింది. పంట చేతికందిన సమయంలో వ్యాపారులు ధర తగ్గించడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అండగా నిలవాల్సిన పొగాకు కంపెనీలు, ప్రభు త్వం పట్టించుకోకపోవడంతో వ్యాపారులు సిండికేటై వారిని నట్టేట ముంచేస్తున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 36 వేల ఎకరాల్లో చుక్కవల్లి, బ్యాడ్జీ, నా టురకం, హెచ్‌డీబీఆర్, బార్లీ, వర్జీనియా తదితర ర కాల పొగాకు సాగు చేశారు. రబీ సీజన్‌లో ఆయా మండలాల్లో 8,374 ఎకరాల్లో సాగైంది. మిడుతూరు మండలంలో అత్యధికంగా 6,717 ఎకరాల్లో సాగైంది.



కోవెలకుంట్ల పొగాకు బేళ్లను విక్రయానికి ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం



ధర లేక సొదరదిన్నె వద్ద దోరణాలపైనే పొగాకు

వేధిస్తున్న గిట్టుబాటు ధర..

కూటమి ప్రభుత్వం పొగాకు రైతులను నిర్లక్ష్యం చేయడంతో పొగాకు రైతు దగా పడ్డాడు. గిట్టుబాటు ధర లేని సమయంలో గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పొగాకు కంపెనీలతో మాట్లాడి మద్దతు ధర కల్పించి కర్షకులను ఆదుకుంది. కొన్ని పొగాకు కంపెనీలు క్వింటాకు రూ.18,500 ధర చెల్లిస్తామని అగ్రిమెంట్ చేసుకుని పంట చేతికందిన తర్వాత రూ. 11వేల నుంచి రూ. 12 వేలు మాత్రమే చెల్లించాయి. గత ప్రభుత్వ హయాంలో క్వింటా రూ.12 వేల వరకు ధర పలికింది. అలాగే నాణ్యత పేరుతో వ్యాపారులు మోసానికి దిగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

వెంటాడిన చీడపీడలు..

పొగాకు సాగుకు ఎకరాకు రూ. 40 వేల వరకు వెచ్చించారు. కౌలు రైతుకు అదనంగా రూ. 20 వేలు భారం పడింది. పైరు రెండున్నర నెల దశలో తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో నీటికుట్టు తెగులు సోకి ఆకులు ఎండిపోయాయి. అధిక వర్షాల కారణంగా పురుగు ఆశించి నష్టం చేకూర్చాయి. అలాగే కలుపు విపరీతంగా పెరిగి పంట ఎదుగుదల నిలిచిపోయింది. చీడపీడల ప్రభావం దిగుబడిపై పడింది. ఎకరాకు 500 నుంచి 600 దోరణాలు వస్తానుకుంటే 300 నుంచి 350 లోపే వచ్చాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండు, మూడు దఫాలు అకాల వర్షాలతో పొగాకు రంగు మారింది. ఎకరాకు 15 క్వింటాళ్ల ఉంచి 18 క్వింటాళ్ల దిగబడులు వస్తాయనుకుంటే 8 నుంచి 10 క్వింటాళ్లలోపే పరిమితమయ్యాయి.

జిల్లాలో రబీలో పొగాకు సాగు వివరాలు..

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
నందికొట్కూరు	7,146
శ్రీశైలం	502
ఆళ్లగడ్డ	241
బనగానపల్లె	141
నంద్యాల	72
డోన్	59
పాణ్యం, గడివేముల	213

పది ఎకరాల్లో పొగాకు సాగు



మూడు ఎకరాల సొంత పొలంతోపాటు ఎకరా రూ. 25 వేలు కౌలు చెల్లించి మరో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని పది ఎకరాల్లో చుక్కవల్లి, బ్యాడ్జి రకాలకు చెందిన పొగాకు సాగు చేశా. పెట్టుబడిగా ఎకరాకు రూ. 50 వేలు వెచ్చించాను. వాతావరణం అనుకూలించకపోవడం, తెగుళ్ల కారణంగా ఎకరాకు 10 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే ఉంది.

– అబ్రహం, రైతు, కంపమల్ల

పెట్టుబడులు పెరిగాయి



ఈ ఏడాది పొగాకు సాగులో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ఎకరా రూ.15 వేలు చెల్లించి ఐదు ఎకరాల్లో పొగాకు సాగు చేశా. కలుపునివారణ, పురుగు ఆశించిన పైరును కాపాడుకునేందుకు రెండు దఫాలు క్రిమి సంహారక మందులు పిచికారీ చేశా. అధిక వర్షాల కారణంగా కలుపు, తెగుళ్ల ఆశించి దిగుబడులపై ప్రభావం పడింది. సరైన ధర కల్పించి ఆదుకోవాలి.

– పీరా, రైతు, సొదరదిన్నె

క్లుప్తంగా

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వాములకు వేదపండితులు దివాకర్ శర్మ, పవనయ్య కల్యాణాన్ని కడు రమణీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన గుమ్మనూరి రాజేశ్వరి వారి కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ సోమవారం తెలిపారు. విరాళాన్ని ఆలయ అర్చకులు,డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులకు దాత కుటుంబ సభ్యులు అందజేశారు. దాతలను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా సుగుణ

కోవెలకుంట్ల: ఐసీడీఎస్ కోవెలకుంట్ల మండలం రేవనూరు సెక్టార్ సూపర్‌వైజర్‌గా సుగుణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ సెక్టార్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గీతాలక్ష్మి పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో సంజామల మండలంలో పనిచేస్తున్న సుగుణను బదిలీ చేయడంతో ఆమె విధుల్లో చేరారు. ఆమె మాట్లాడుతూ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ సుజాత,ఆర్ఎంఓ డాక్టర్ శిరీష అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఇండియా భారత్ యుద్ధ సమయంలో సైనికులకు రక్తం అవసరం ఉంటుందని ఇలాంటి సమయంలో రక్తదానం చేయడం ఎంతో పుణ్యమన్నారు. శిబిరాన్ని మండల డిప్యూటీ ఎంపీడీఓ సతీష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. స్వచ్ఛందగా రక్తదానం చేసిన 28 మంది ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూపు ప్రతినిధులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. డాక్టర్ శ్రీలక్ష్మీ ల్యాబ్ టెక్నిషియన్స్ అస్లాం,షేక్షావలి ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూపు ప్రతినిధులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకోవడం సంతోషం

డోన్: ఈనెల 11, 12 తేదీలలో ఏలూరు కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు ఘనంగా జరిగాయని కవి, రచయిత, ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు సోమవారం తెలిపారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కుమార్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరిల చేతుల మీదుగా కవిరత్న పురస్కారాన్ని అందుకోవడం తనకు సంతోషంగా ఉందన్నారు.

అవుకులో మోస్తరు వర్షం

అవుకు: మండల కేంద్రంలో సోమవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. మధ్యహ్నం నుంచి తీవ్ర ఉక్కపోతగా ఉండి సాయంత్రం ఈదురు గాలులు వీయడంతో విద్యుత్‌కు కొంత అంతరాయం కలిగింది. రాత్రి 8.30 నుంచి 9.30గంటల వరకు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు వీధుల్లో వర్షం నీరు పారింది.అలాగే కల్లాల్లో ఆరబెట్టిన దిగుబడులకు రైతులు టార్పలిన్ పట్టలు కప్పి పంట ఉత్పత్తులను రక్షించుకున్నారు.

ఆక్రమణల తొలగింపు

బేతంచెర్ల: స్థానిక కొత్త బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న ఓ ఉద్యోగి బేతంచెర్ల–కర్నూలు రహదారిలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడంతో నగర పంచాయతీ అధికారులు సోమవారం తొలగింపు పనులు చేపట్టారు. జేసీబీలతో ఇంటి ముందున్న ఆక్రమణను తొలగించారు. ప్రభుత్వ ఉద్యోగి రోడ్డు స్థలాన్ని ఆక్రమించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో నగర పంచాయతీ సిబ్బంది ఆక్రమణలను తొలగించారు.

కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేత జట్లుకు బహుమతి, జ్ఞాపక అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కబడ్డీ మహిళా విభాగం, రాష్ట్రస్థాయి పురుషుల విభాగం పోటీల్లో గెలుపు పొందిన జట్లకు నగదు, జ్ఞాపికలను సోమవారం అందజేశారు. జాతీయ స్థాయి మహిళా విభాగంలో మొదటి బహుమతిగా విజయనగరం జట్టు, రెండవ బహుమతిగా హర్యానా జట్టు, మూడవ స్థానంలో తమిళనాడు, నాల్గో స్థానంలో అనంతపురం,ఐదవ స్థానంలో తాడిపత్రి, ఆరవ బహుమతిగా బనగానపల్లె జట్లు దక్కించుకున్నాయి. విజేతలకు వరుసగా రూ.40వేలు,రూ.30వేలు, రూ.20వేలు,రూ.15 వేలు,రూ.10వేలు,రూ.5వేల నగదు అందజేశారు. అలాగే రాష్ట్రస్థాయి కబడ్డీ పురుషుల విభాగంలో విజేత ప్యాపిలి జట్టు, రెండో స్థానంలో గోనెగండ్ల , మూడవ బహుమతి కొలిమిగుండ్ల, నాల్గో బహుమతి ఓంకారం, ఐదవ బహుమతి బేతంచర్ల, ఆరో బహుమతి యంబాయి జట్టు దక్కించుందని వివరించారు. వారికి వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు,రూ.6వేలు రూ.4వేల నగదుతో పాటు జ్ఞాపిక అందజేశారు.

రక్తదాన శిబిరం

పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. 25 మంది రక్తదానం చేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధుమౌనిక, బనగానపల్లె సీఐలు మంజునాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, నంద్యాల ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

శుభకార్యం



వేడుకలో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సీనియర్ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి కుమార్తె రాగిణి వివాహ ముహూర్త కార్యక్రమం ఆయన స్వగృహంలో సోమవారం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, మండల నాయకుడు చల్లా విఘ్నేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు



పల్లకీలో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

అవుకు: పట్టణంలో జరుగుతున్న తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి శేష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ముందుగా అర్చకులు స్వామి అమ్మవార్లకు ఉదయం పలు పూజా కార్యక్రమాలు జరిపించి పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయం నుంచి తేరువీధి, రాజావీధి, సెంటర్ మీదుగా మండపం వీధికి పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లి, అక్కడి నుంచి తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ కలయిక



పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాల (2004–05 పదో తరగతి బ్యాచ్) పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాలలో సమావేశమయ్యారు. ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాఠశాలలో పండగ సందడి నెలకొంది. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.45 వేలు వెచ్చించి స్టేజికి పైకప్పు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, వనమరాజు, బాలసుబ్బయ్య, ప్రభుదాస్, శేషయ్య, జయరాంరెడ్డి, ఖాశీం, చంద్రమోహన్, పూర్వ విద్యార్థులు శివనాగరాజు(డీఎస్పీ), ఉమాశంకర్, శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

బేతంచెర్ల: ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగ రాజు కోరారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్లను అడ్డుకోకపోతే కార్మికుల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొని కేంద్రప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం సీఐటీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎల్లయ్య, సంజీవ నాయుడు, ట్రెజరర్‌గా మద్దిలేటిని ఎన్నుకున్నారు.

ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులు గావించి పల్లకీ సేవ చేపట్టారు. అలాగే.. సహస్త్ర దీపాలంకరణ జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న సీపీఐ నాయకులు

కొలిమిగుండ్ల: సిమెంట్ ఫ్యాక్టరీలకు రాక పోకలు సాగించే వాహనాల వల్ల వచ్చే దుమ్ము,ధూళితో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం కొలిమిగుండ్ల, కల్వటాల, నందిపాడు, మీర్జాపురం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి నిత్యం రాక పోకలు సాగించే వాహనాల వల్ల వందల ఎకరాల్లో రైతులు పంటలను కోల్పోతున్నారన్నారు. ఈ సమస్యపై కొద్ది రోజుల క్రితం జాయింట్ కలెక్టర్, పర్యావరణ అధికారులను కలిసి విన్నవించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అధికారుల బృందం పర్యటించి దుమ్ము,ధూళి వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టం వాటిల్లిందని గుర్తించారు. ఇప్పటి వరకు సిమెంట్ కంపెనీ నుంచి ఎలాంటి స్పందన రాలేదని మండిపడ్డారు. వారంలోగా కంపెనీల యాజమాన్యాలు,రైతులతో చర్చించేలా చర్యలు చేపడుతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్,జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, కొలిమిగుండ్ల మండల కన్వీనర్ పుల్లయ్య,రైతులు పెద్దయ్య, శరత్, గోపాల్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: డోన్ ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్‌లో గోసానిపల్లె ఫీడర్ 11కెవి మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వర రెడ్డి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ కింద ఉన్న ధర్మారం, గోసానిపల్లె, కోట్లవారిపల్లె ప్రాంతాల రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంట్ తెల్లవారు జామున 3 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన లింగాల శివారెడ్డి కోడలు లింగాల రమాదేవి (43)గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు దాతలు సాధినేని శ్రీదేవి, రామకృష్ణారెడ్డి దంపతుల సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు సూదన్‌రెడ్డి, రాజు ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రవి కుమార్, వలిబాషా, కేశాలు నాయుడు, మధుకుమార్ పాల్గొన్నారు.

కారు ఢీ...గేదెలు మృతి





మృతి చెందిన గేదె, ముదిగేడు వద్ద నుజ్జునుజ్జయిన కారు

సంజామల: మండలంలోని ముదిగేడు గ్రామ సమీపంలో ఓ కారు అతి వేగంగా రోడ్డుపై వెళ్తున్న బర్రెలను ఢీ కొనడంతో మూడు బర్రెలు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు,వాహనదారులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం చూసేసరికి రోడ్డుపై మూడు గేదెలు మృతి చెంది ఉండగా.. వాటి పక్కన ఓ కారు నుజ్జునుజ్జయి ఉందని తెలిపారు. కోవెలకుంట్ల నుంచి అనంతరపురం జిల్లా బుగ్గ సమీనంలో పెద్దమ్మ గుడికి వేగంగా వెళ్తుండగా ముదిగేడు సమీపంలె బర్రెలును ఢీ కొనడంతో మూడు బర్రెలు మృతి చెందగా మరో గేదెకు తీవ్రగాయాలయ్యాయి. కారులో ఐదు వ్యక్తులు ఉండగా ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

హోరాహోరీగా ఒంటెద్దు బండి పోటీలు

- విజేతగా నిలిచిన పెద్దకందుకూరు వృషభం



రాతిదూలం లాగుతున్న ఎద్దు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ఒంటెద్దుబండి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ ప్రసాదరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి ప్రారంభించారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 12 వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. నిర్ణీత 10 నిమిషాల సమయంలో ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరుకు చెందిన పెద్ద గురువయ్య వృషభం ప్రథమ స్థానంలో నిలిచి రూ. 15 వేలు కై వసం చేసుకుంది. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన పోషన నరసింహారెడ్డి ఎద్దు రెండవ స్థానంలో రూ. 10 వేలు దక్కించుకుంది. ఇదే జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తుంగా నారాయణస్వామి వృషభం తర్వాతి రెండుస్థానాల్లో నిలిచి రూ.8 వేలు, రూ.6వేలు బహుమతులు గెలుపొందాయి. నాసారి సిద్దయ్య, సొదరదిన్నె సర్పంచ్ ఆసం మధుసూదన్‌రెడ్డి, పాండురంగస్వామి ఉత్సవ కమిటీ ఆర్థిక సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకులు కరిమద్దెల మురళీకృష్ణ, పెనుగొండ రాజశేఖర్, గద్దం నాగేశ్వరరెడ్డి, సహదేవరెడ్డి, లక్ష్మినాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి



బుద్ధుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం గౌతమబుద్ధుని జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బుద్ధుని 2,569 జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బుద్ధుడి బోధనలు అనుసరణీయమన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటయ్య, నాయకులు సుధాకర్, కత్తి ఓబులేసు, వడ్డె సుబ్బరాయుడు, దాట్ల సుబ్బారెడ్డి, అహమ్మద్ హుసేన్, రాములమ్మ పాల్గొన్నారు.

రోడ్ ట్యాక్స్ కట్టకపోతే జరిమానాలు

- ఆర్‌టీఓ క్రాంతికుమార్



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: రాష్ట్రానికి కట్టాల్సిన రోడ్ ట్యాక్స్ కట్టకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని ఆర్‌టీఓ క్రాంతికుమార్ వాహనదారులకు హెచ్చరించారు. పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం ఆర్‌టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో రోడ్ ట్యాక్స్, అధికలోడ్ తదితర నిబంధనలకు విరుద్ధంగా రోడ్డెక్కిన వాహనాల నుంచి జరిమానా రూపంలో రూ.3,97,310 వసూలు చేశారు.

భూగర్భ జలాల పెంపునకు తోడ్పడాలి



బావి వద్ద పూడిక తీత పనులకు పూజ చేస్తున్న ఏపీఓ, సర్పంచ్

బేతంచెర్ల: తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా భూగర్భ జలాల పెంపునకు తోడ్పాటు అందించాలని ఏపీఓ విజయ రాణి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామంలోని పురాతన బావి పూడిక తీత పనులకు ఉపాధి హామీ పథకం కింద భూమి పూజ చేశారు. ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని చెర్వులు, పురాతన బావుల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లన్న నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొంతు వాపు వ్యాధి ప్రమాదకరం

డోన్: పశువుల్లో గొంతు వాపు వ్యాధి ప్రమాదకరమని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని పశువులకు సోమవారం వ్యాధినిరోధక టీకా వేసే కార్యక్రమాన్ని డాక్టర్ రాజ్యలక్ష్మి, మహమ్మద్‌రఫి తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వానలకు పశువుల్లో గొంతు వాపు వ్యాధి ప్రబలే అవకాశం ఉన్నందువల్ల పశుపోషకులు, రైతులు ముందుగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. వ్యాధి బారిన పడిన పశువులకు తీవ్ర జ్వరం, కళ్లు ఎర్రబడి నీరు కారడం, నోటి వెంట చొంగ కార్చడం, గొంతు కింది భాగం వాపుతో కూడిన నొప్పి ఉండటంతో పాటు ఆయాసం ఉంటుందన్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే పశువులు మృతిచెందే ప్రమాదం ఉందన్నారు. ఈనెల 31 వరకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్పాల సయ్యాట



బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో రెండు సర్పాలు సయ్యాటలాడుతూ చూపరులను కనువిందు చేశాయి. సోమవారం నిర్జీవ ప్రదేశంలో ఒకటికొకటి పెనవేసుకుని నృత్యం చేస్తున్నట్లుగా కనిపించాయి. అటువైపు వెళ్లిన వారు అలజడి చేసినా అవి పట్టించుకోకుండా సుమారు గంటకు పైగా సయ్యాటలాడాయి.

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎం.పెండేకల్లు గ్రామానికి చెందిన యాపదిన్నె రాజు(55) కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ పుల్లన్న తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాజు కొంత కాలంగా మద్యానికి బానిసై ఏ పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండేవాడు. ఈక్రమంలో భార్య ఆదిలక్ష్మి, కుమారుడు మద్దిలేటి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాజు ఆదివారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.